క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

కురుపాం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు, సీఐటీయూ నాయకుడు కె.అవినాష్ అన్నారు. మండల కేంద్రంలోని రావాడ జంక్షన్ కాంప్లెక్స్ వద్ద భవన నిర్మాణ కార్మికులు గురువారం చేపట్టిన నిరసనకు హాజరైన వారు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసే పార్టీకే ఓటు వేద్దామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీకి సన్మానం



ప్రమీలను సన్మానిస్తున్న గ్రామస్తులు

సీతంపేట: ఇటీవల పూణేలో జరిగిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ముత్యాలు ఆశ్రమపాఠశాల పీఈటీ ఎస్.ప్రమీల హైజంప్‌లో జాతీయ స్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. దీంతో ముత్యాలు గ్రామంలోని అక్షరబ్రహ్మ పూజా మందిరం వద్ద గ్రామస్తులు పీఈటీని గురువారం సన్మానించారు. అక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం ఏరియా కోఆర్డినేటర్ ఎస్.ఆనందరావు, ఎస్.గంగారావు, ఎస్.వెంకటరావు, ఎస్.రమేష్, తదితరులు ఆమెను అభినందించారు. గ్రామం పేరును జాతీయస్థాయిలో నిలబెట్టిందని కొనియాడారు.

శతశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీపీఓ సత్యనారాయణ

సీతంపేట: శతశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీడీపీ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఈగ్రామ స్వరాజ్ వెబ్‌సైట్, క్లాప్‌మిత్ర వేతనాలు, పంచాయతీల విద్యుత్ బకాయిలపై చర్చించారు. మోడల్ గ్రామ పంచాయతీలను ఎలా తయారుచేయాలో వివరించారు. అలాగే ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియోను విజవయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం వేగవంతం చేయాలి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: పట్టణంలో ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో పర్యటించి ఆర్అండ్‌బీ పనుల ప్రగతిపై ఆరా తీశారు. పెండింగ్ పనులు పూర్తిచేసి నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పాచిపెంట మండలంలోని పాంచాలి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీచేశారు. పోలింగ్‌కేంద్రంలో మౌలిక వసతులు, సదుపాయాలను పరిశీలించి పది రోజుల్లో అన్ని పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేకాలంకరణ

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామి వారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు తెలియజేశారు. ఆలయం చుట్టు పక్కలగ్రామాల భక్తులతో పాటు జిల్లాలోని పలుప్రాంతాలనుంచి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు పూజాసామగ్రితో వివిధ రకాల వాహనాల్లో తరలివచ్చి పూజల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- పరీక్ష కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలు



వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఓ గదిలో ఏర్పాటు చేసిన బెంచీలు

వీరఘట్టం: ఇంటర్మీడియట్ పరీక్షలు నిఘా నీడలో జరగనున్నాయి. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలకు సంబంధించి తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 11 గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 260 మంది ఫస్టియర్, 279 మంది సెకెండియర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ మాచర్ల కుమారస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, మాల్ ప్రాక్టీస్ జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇదిలా ఉంటే పరీక్ష కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై ఎం. గోవింద తెలిపారు. సమీపంలోని పాన్‌షాపులు, దుకాణాలు, జిరాక్స్ షాపులు మూసి వేయాలన్నారు.

నేటి నుంచి..

సీతంపేట: నిఘా కెమెరాల మధ్య ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. సీతంపేటలో గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ ఇంటర్ విద్యార్థులు 224 మంది, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 193 మంది.. బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 273, సెకెండియర్ 251 మంది పరీక్షలు రాయనున్నారు. గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరెంటిండెంట్లుగా పి.సూర్యకుమారి, నాగభూషణ రావు, డీఓగా వెలమల అప్పారావు వ్యవహరించనున్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి, మూడు పరీక్షల కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు కె.పద్మ, యుగంధర్, సత్యవతి గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఎస్టీ), భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు), భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలికలు) పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒకరోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాస్తే మరుసటిరోజు ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 267 మంది ఫస్టియర్ విద్యార్థులు, 267 మంది సెకండియర్ విద్యార్థులు, భద్రగిరి బాయ్స్ కళాశాల నుంచి 122 మంది ఫస్టియర్ విద్యార్థులు, 95 మంది సెకండియర్ విద్యార్థులు, భద్రగిరి గరల్స్ కళాశాల నుంచి 143 మంది ఫస్టియర్ విద్యార్థులు, 111 మంది సెకండియర్ విద్యార్థులతో పాటు గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ నుంచి 36 మంది ఫస్టియర్ విద్యార్థులు, 36 మంది సెకండియర్ విద్యార్థులు, శారది ఒకేషనల్ కళాశాల నుంచి 162 మంది ఫస్టియర్ విద్యార్థులు, 168 మంది సెకండియర్ విద్యార్థులు, రుషిత ఒకేషనల్ కళాశాల నుంచి 139 మంది ఫస్టియర్ విద్యార్థులు, 158 మంది సెకండియర్ విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామన్నారు.



గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బెంచీలపై హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న దృశ్యం



సీసీ కెమెరాల పనితీరును మానటరింగ్ రూమ్‌లో పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కుమారస్వామి



సీతంపేట: బాలికల కళాశాలలో తరగతి గదిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

నేడు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కురుపాం: మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధిలో ఉన్న కోనగూడ బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కలిసి శుక్రవారం భూమిపూజ చేయనున్నారు. ఇక్కడి రోడ్డు సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె చొరవతో ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.1.20 లక్షలు మంజూరయ్యాయి. వీటితో గుమ్మలక్ష్మీపురం తారురోడ్డు నుంచి కోనగూడకు 1.4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ ఆరిక గోపాలరావు తెలిపారు.

ఎమ్మెల్యే పరిశీలన



నిర్మాణాలు పూర్తి చేయాలని సూచిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని శివ్వన్నపేట గ్రామ సమీపంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణాలను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం పరిశీలించారు. అనంతరం నిర్మాణాలు జరుగుతున్న తీరు, పూర్తయిన, పూర్తికావస్తున్న నిర్మాణాలపై ఆరాతీశారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత తదితరులు ఉన్నారు.

అలవెన్స్‌ల పునరుద్ధరణకు హామీ



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనం కాక మునుపు ఉన్న కొన్ని అలవెన్స్‌లను పునరుద్ధరించేందుకు ప్రభుత్వ అంగీకారం లభించిందని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. పాలకొండలో గురువారం ఏర్పాటు చేసిన సహ ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆర్ఈఎంఎస్ స్కీమ్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. దీంతో పాటు రిఫరల్ ఆస్పత్రి వైద్య సౌకర్యాల కల్పనకు, ఉద్యోగుల భద్రతకు నిర్ణయించిన సర్క్యులర్ 01/2019 యథాతథంగా అమలు చేయుటకు, సిబ్బందికి లామినేటెడ్ గుర్తింపు కార్డులు అందించేందుకు ఎం.డి సానుకూలత తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు బీజీ రావు, కేకే రావు, ఎం.లింగమూర్తి, డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావు, సుందరరావు, దుమ్మెద దుర్గారావు, బాసూరి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



ఉప తహసీల్దార్ బుచ్చయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పాలకొండ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు ఉప తహసీల్దార్ బి. బుచ్చయ్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ మాట్లాడుతూ.. 12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని, 11వ పీఆర్‌సీ బకాయిలు విడతల వారీగా కాకుండా ఒకే మొత్తంలో చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీవీ రమణ, నాగరాజు, టి.ఉమామహేశ్వరరావు, ఎస్వీ రమణ, జి. వెంకటరావు, త్రినాథ, గడ్డయ్య, శశిరేఖ జయలక్ష్మి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న శాసనమండలి విప్, తదితరులు

పాలకొండ రూరల్: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ తన సొంత కుటుంబ సభ్యులవలే ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి భావించి అండగా నిలుస్తున్నారని శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని అంజనేయకాలనీకి చెందిన కొట్టిశ జగన్‌మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రూ. పది లక్షలు మంజూరయ్యాయి. దీంతో బాధితుడి ఇంటికి గురువారం సాయంత్రం వెళ్లి చెక్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పాలవలస ఇందుమతి, వార్డు కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, పాలవలస ధవళేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రచారం..

భామిని: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొత్తకోట తిరుపతిరావు అన్నారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా మండల కేంద్రంలో గురువారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల రాంబాబు, టంకాల వాసుదేవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.2.42 కోట్లు విడుదల

గరుగుబిల్లి: మండలంలోని 25 గ్రామపంచాయతీలు, 13 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక కింద లబ్ధిదారులకు అందజేస్తున్న పింఛన్ల పంపిణీకి రూ.2.42 కోట్లు విడుదలైందని ఎంపీడీవో పి.సూర్యారావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఫిబ్రవరి నెల పింఛన్లకు సంబంధించిన ఈ నిధులను మార్చి ఒకటో తేదీన లబ్ధిదారులందరికీ అందజేస్తామన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 8,461 మంది లబ్ధిదారులున్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ/వీరఘట్టం: సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పాలకొండ డీఈ మూర్తి, వీరఘట్టం ఏఈ డి.బాలాజీ గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. పాలకొండ పట్టణంతో పాటు తంపటాపల్లి, మంగళాపురం, కొండాపురం, బాసూరు, బుక్కురు, లుంబూరు, నవగాం, పొట్లి, అవలంగి, ఎం.సింగుపురం, బెజ్జి, అట్టలి, వాటపాగు, తుమరాడ, తదితర గ్రామాలతో పాటు వీరఘట్టం మండలంలోని పలు ప్రాంతాలు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతు సదస్సు విజయవంతం చేయాలి

పాలకొండ: పట్టణ కేంద్రంలో శుక్రవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్న జిల్లా రైతు సదస్సును విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సదస్సులో భూ హక్కుల చట్టంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు

మక్కువ: విద్యార్థి దశనుంచి సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ మంజుల వీణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మక్కువ మండలంలోని ములక్కాయ వలస గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ మంజులా వీణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సేవతో ఆత్మసంతృప్తి కలుగుతుందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీఓ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసుబాబు, గణేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవి నేపథ్యంలో మండల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 22 సచివాలయాలకు సంబంధించిన అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి వనరులు, తాజా స్థితిగతులపై సమీక్ష చేపట్టారు. ప్రణాళికాబద్ధంగా సంక్షేమ పథకాల అమలు చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె. సూర్యనారాయణ, తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

భామిని:

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు అన్నారు. వెత్రిగడ్డపై కాజ్‌వే నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. బత్తిలి సర్పంచ్ టింగ శాంతికుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, రూ. 33 లక్షలతో కాజ్‌వే నిర్మించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దృష్టికి సమస్య తీసుకెళ్లిన వెంటనే నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్.బీష్మా, బొడ్డేపల్లి ప్రసాద్, రాగోలు రాధాకృష్ణ, నిమ్మల భాస్కరరావు, నిమ్మల దాస్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జై గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం చేపట్టారు. కార్యక్రమంలో వీరఘట్టం, పార్వతీపురం, మక్కువ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఈ హోమంలో పాల్గొంటే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహాయ సహకారాలతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

సీసీ కాలువల నిర్మాణానికి భూమిపూజ



రాజ్యలక్ష్మీపురంలో సీసీ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైస్ ఎంపీపీ శరత్‌బాబు

కొమరాడ: మండలంలోని కంబవలస గ్రామపంచాయతీ పరిధిలోని రాజ్యలక్ష్మీపురం, కొత్తకంబవలస, కోనవలస గ్రామాల్లో సీసీ కాలువల నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ సంగిరెడ్డి శరత్‌బాబు గురువారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో పాటు గ్రామ పంచాయతీ నిధుల నుంచి మంజూరైన రూ.6 లక్షలతో ఈ కాలువలు నిర్మించనున్నారు. వైఎస్ ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో ఇదే పంచాయతీలోని కంచరపాడు, లక్ష్మీపేట, పాతకంబవలస గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించడంతో రచ్చబండలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

దివ్యాంగులకు మెరుగైన విద్యనందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర సహాయ సహిత విద్య సమన్వయకర్త అమ్మినాయుడు

గరుగుబిల్లి: భవిత కేంద్రాల్లోని దివ్యాంగులకు మెరుగైన విద్యనందించాలని రాష్ట్ర సహాయ సహిత విద్య సమన్వయకర్త ఎన్.అమ్మినాయుడు సూచించారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు, ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. అనంతరం కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు సక్రమంగాగా ఫిజియోథెరపీ సేవలు అందించడంతో పాటు నాణ్యమైన విద్యనందించాలన్నారు. అలాగే దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా సహిత విద్య సమన్వయకర్త పి.భానుమూర్తి, ఎంఈవో-2 కె.కొండలరావు, ఐఈఆర్‌టీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం

వీరఘట్టం:

మార్చి 3న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అందరం సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వలంటీర్ల సహకారంతో వారికి కేటాయించిన 50 గృహాల్లో ఉండే 0-5 ఏళ్ల లోపు చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ ఉమామహేశ్వరి, సూపరింటిండెంట్ వెంకటరమణ, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

గరుగుబిల్లి: మండల వ్యాప్తంగా మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేద్దామని ఎంపీడీవో పి.సూర్యారావు పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బందితో సమావేశమైన ఆయన ఐదేళ్ల లోపు పిల్లలంతా పోలియో చుక్కలు వేసుకునేలా చూడాలన్నారు. పోలియో రహిత సమాజానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. సమావేశంలో వైద్యుడు వర్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా వ్యాక్సినేషన్



గరుగుబిల్లి: పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేస్తున్న ఎంపీడీవో సూర్యారావు

పాలకొండ రూరల్: ఈనెల 3న చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని డీఎంహెచ్ఓ బి. జగన్నాథరావు అన్నారు. అన్నవరం పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించి రికార్డులు, వ్యాక్సినేషన్ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని అన్నవరం, ఎం.సింగుపురం, అర్బన్ పీహెచ్‌సీల ద్వారా అర్హులైన చిన్నారులను గుర్తించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. వ్యాక్సినేషన్ శతశాతం పూర్తి చేయాలని తెలిపారు. ఈయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి వి. కమలనాథ్, తదితరులున్నారు.



అన్నవరం పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ నిల్వలు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు